క్లుప్తంగా

శ్రీలక్ష్మీ నరసింహస్వామికి పూజలు

మధురపూడి: కోరుకొండలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాలే కాకుండా కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన భక్తులు ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం అన్నసమారాధన నిర్వహించింది. తాళ్లపూడి తాహసీల్దార్ మాధవి స్వామివారిని దర్శించుకున్నారు.

అర్హులు ఓటు హక్కు పొందాలి



పెదపూడిలో ఓటు హక్కు దరఖాస్తును స్వీకరిస్తున్న తహసీల్దార్ సుభాష్

పెదపూడి: అర్హులంతా ఓటు హక్కు పొందాలని తహసీల్దార్ టి.సుభాష్ అన్నారు. ఆదివారం పెదపూడిలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. స్థానికంగా పర్యటించి ప్రజలకు ప్రత్యేక ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించారు. అనంతరం ఓటు హక్కు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎం.త్రివేణి, వీఆర్వో చండి, సునీత, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాస్‌చౌదరి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటర్ల నమోదుకు మిశ్రమ స్పందన



కోటపాడు పోలింగ్‌బూత్ వద్ద ఏర్పాటు చేసిన ఓటర్ల నమోదు శిబిరం

రంగంపేట: కొత్త ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల వద్ద గత రెండు రోజులుగా నిర్వహించిన శిబిరాల్లో ఓటర్ల నమోదుకు మిశ్రమ స్పందన లభించింది. మండలంలోని 48 పోలింగ్ బూత్‌లలో శనివారం కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6లు 132, మృతి చెందిన వారి ఓట్ల తొలగింపు కోసం ఫారం-7లు 2, తప్పుల సవరణ కోసం ఫారం-8లు 45 కలిపి 179 దరఖాస్తులొచ్చాయి. ఆదివారం మరో 169 దరఖాస్తులు అందాయి. మొత్తంగా రెండు రోజుల్లో కొత్త ఓటర్ల నమోదుకు 264, తప్పుల సవరణకు 348, మృతి చెందినవారి ఓట్ల తొలగింపునకు 10 ఫారాలు అందాయి.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



పందలపాకలో లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న సత్తి హరిప్రసాద్‌రెడ్డి తదితరులు

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో ఉజ్వల్ పథకంలో భాగంగా మంజూరైన కేంద్ర ప్రభుత్వ ఉచిత గ్యాస్ కనెక్షన్లను ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. రాయవరానికి చెందిన కార్తికేయ గ్యాస్ ఏజెన్సీ ద్వారా లబ్ధిదారులకు గ్యాస్ సిలెండర్, స్టవ్ తదితర సామగ్రిని సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యాసలపు శ్రీనివాస్, కర్రి సతీష్, రెడ్డి సత్తిరాజు, వలంటీర్లు కొటాని దేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు జంబూపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం

మధురపూడి: కోరుకొండ మండలం జంబూపట్నం గ్రామంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. దీనికి ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరుకావాలని కోరారు.

శాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు

మధురపూడి: కోరుకొండ ఎస్సార్‌నగర్ ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం ప్రపంచంలో యుద్ధాలు సమసిపోయి, అంతా శాంతి చేకూరాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెవరెండ్ ఫాదర్ మాణిక్యం ఆధ్వర్యంలో ఇజ్రాయేలు- పాలస్తీనా, రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధాలు నిలిచి, శాంతి సిద్ధించాలని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపదేశి బెల్లపు డేవిడ్, సంఘ సభ్యులు మేరీ విద్య, విక్టర్, సంధ్యా రాణి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

జనసేన బైక్ ర్యాలీ

రాజానగరం: దివాన్‌చెరువు నుంచి శ్రీరామపురం వరకూ జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం బైకు ర్యాలీ జరిగింది. అనంతరం శ్రీరామపురంలో బహిరంగ సభ నిర్వహించారు.

ప్రమోదం పక్కనే ప్రమాదం

- మరో ఆరు రోజుల్లో దీపావళి పండగ
- టపాసులతో అజాగ్రత్త వద్దంటున్న అధికారులు



పందలపాకలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న దీపావళి సామగ్రి

బిక్కవోలు: చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా ఆనందోత్సాహాలతో నిర్వహించుకునే దీపావళి పండగకు మరో ఆరు రోజులే సమయముంది. దీపావళి సందర్భంగా టపాసులు కాల్చేటప్పుడు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదమే.. దీపావళి ప్రతి ఇంటా ఆనందాల కాంతులు వెదజల్లాలంటే జాగ్రత్తలు తప్పనిసరి.. మరోవైపు బాణసంచా తయారీదారులు, దుకాణదారులు సైతం అజాగ్రత్తగా వ్యవహరించడానికి లేదని అధికారులు హెచ్చరిస్తున్నారు. గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని దుకాణాల వద్ద ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి అని చెబుతున్నారు.

వ్యాపారులు పాటించాల్సిన నియమాలు

బాణసంచా విక్రయించే వ్యాపారులు ముందుగా పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారుల నుంచి అనుమతులు పొందాలి. జన సంచారం లేని, ఊరికి దూరంగా ఉండే ప్రాంతాల్లో దుకాణ సముదాయాలను ఏర్పాటు చేసుకోవాలి. విక్రయ ప్రాంతంలో తప్పనిసరిగా ఇసుక, నీరు, కార్బన్‌డైయాక్సైడ్ వాయువులను అందుబాటులో ఉంచుకోవాలి. దుకాణాల సమీపంలో ఎవరూ సిగరెట్లు, బీడీలు కాల్చకుండా పొగ తాగరాదని సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలి. అలాగే దుకాణాల సమీపంలో ఎవరూ సెల్‌ఫోన్‌లో మాట్లాడకుండా చర్యలు తీసుకోవాలి. దుకాణాల మధ్య కనీసం పది అడుగుల దూరం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. మందుగుండు సామగ్రి విక్రయించే కేంద్రాల్లో విద్యుత్‌కు సంబంధించిన వైరింగు సక్రమంగా ఉండేలా జాగ్రత్త వహించడంతో పాటు సాధ్యమైనంత వరకూ ఎల్‌ఈడీ బల్బులు వాడడం మంచిది. ప్రతి దుకాణం ఎదుట టపాకాయల ధరల పట్టిక, అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నెంబర్లు తప్పకుండా ఉండాలి.

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు

గ్రామీణ ప్రాంతాల్లో పంటపొలాలు, గడ్డివాములు, పూరిగుడిసెలు ఎక్కువగా ఉంటాయి కనుక అక్కడ రాకెట్లు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు కాల్చకూడదు. ప్రధానంగా టపాసులు కాల్చేటప్పుడు పిల్లల విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా జీవితకాలం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అందుకే పెద్దల సమక్షంలోనే పిల్లలు టపాసులు కాల్చేలా చూసుకోవాలి. అనపర్తి నియోజకవర్గంలోని పందలపాకలో ఒకటి, బిక్కవోలులో రెండు బాణసంచా తయారీ కేంద్రాలున్నాయి. అలాగే నియోజకవర్గంలో సుమారు 50 బాణసంచా విక్రయ దుకాణాలు ఏర్పాటుకానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అనుమతులు తప్పనిసరి



టపాకాయలు విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కడైనా అనుమతులు లేకుండా టపాకాయలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే చర్యలు తప్పవు.

– పోసిబాబు, తహసీల్దార్, బిక్కవోలు

అప్రమత్తంగా వ్యవహరించాలి



ప్రమాదాలనేవి ప్రారంభంలో చిన్నవిగానే ఉంటాయి. అందుకే బాణసంచా విషయంలో ఏ చిన్న ప్రమాదం జరిగినా అప్రమత్తంగా వ్యవహరించాలి. అందుబాటులో ఉన్న వనరులతో ప్రమాదాన్ని నివారించేందుకు ప్రయత్నించాలి. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి లేదా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలి.

– జి.శ్రీనివాస్‌రెడ్డి, అగ్నిమాపక అధికారి, అనపర్తి

అర్హులందరికీ ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



పెదపూడిలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జర్నలిస్టులు

పెదపూడి: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని రాష్ట్ర కేబినేట్ సమావేశంలో ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం పెదపూడిలో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి సమక్షంలో కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల జర్నలిస్టు సంఘాల నాయకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి శాలువ కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులతో పాటు వర్కింగ్ జర్నలిస్టులకూ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని అక్రిడేషన్ కమిటీ మెంబర్ షేక్ సలీమ్, ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ అధ్యక్షుడు అల్లుమల్లు ఏలియా ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, బిక్కవోలు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు షేక్ ఉస్మాన్ బాషా, స్థానిక ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వల్లూరి వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పెదపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం



పెదపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడిలో ఆదివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో అన్ని పథకాలు టీడీపీ నాయకులే పొందారని, పేదలకు పథకాలు అందని ద్రాక్షగా మారాయన్నారు. అయితే జగనన్న సీఎం అయ్యాక తమ ఇళ్ల ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయంటూ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. పేదల అభ్యున్నతికే సీఎం జగన్ నవరత్న పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అవినీతికి తావులేకుండా, పార్టీల ప్రమేయం లేకుండా, కుల మతాలకు అతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు దళితులు, మహిళల అభ్యున్నతికి చేసింది శూన్యమని విమర్శించారు. ఇప్పుడు చంద్రబాబును నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించడానికి ప్రజలందరూ మద్దతు తెలుపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, మండల రైతు విభాగం కన్వీనర్ మార్ని వెంకట్రావు, గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు, మార్ని పెద్దబ్బు, అబ్బు, గార్లపాటి ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందంగా పూర్వ విద్యార్థుల కలయిక



బిక్కవోలులో కలుసుకున్న 1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాలలో 1993-94లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ, చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుంటూ ఆనంద డోలికల్లో తేలియాడారు. జ్ఞాపకాల దొంతరలను నెమరువేసుకుంటూ రోజంతా ఆటపాటలతో సందడి చేశారు. డాక్టర్ రాజీవ్, వీఆర్వో కొటాని అశోక్, పి.శ్రీనివాసరావు, కె.రాజేష్, పి.రాఘవరామ్ తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి



పోలింగ్ కేంద్రంలో బీఎల్‌ఓలకు సూచనలిస్తున్న తహసీల్దార్

రాజానగరం: కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ఓటరు నమోదు కార్యక్రమానికి ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పవన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. జనవరి ఒకటి నాటికి 18ఏళ్లు నిండిన వారంతా అర్హులేనన్నారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాలలో జరిగిన స్పెషల్ క్యాంపెయిన్ ప్రక్రియను ఆయన పరిశీలించి, బీఎల్‌ఓలకు సూచనలిచ్చారు. కొత్తగా ఓటు హక్కు పొందాలనుకునే వారు ఫారమ్-6లో దరఖాస్తు చేయాలన్నారు. అలాగే సవరణలు, తొలగింపులు ఇతర అవసరాలకు ఫారం 7, ఫారం 8లను వినియోగించుకోవచ్చన్నారు. డిసెంబరు 2, 3 తేదీల్లో మరోసారి పోలింగ్ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇతర సమయాల్లో వీఎల్‌ఓలకుగాని, రెవెన్యూ కార్యాలయంలోగాని నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ అవకాశం డిసెంబరు 9 వరకూ ఉంటుందన్నారు.

అద్భుతంగా.. ఆకట్టుకునేలా..

- పచ్చని చెట్ల మధ్య ది హ్యాపీ స్ట్రీట్ పార్కు
- రూ.2.8 కోట్లతో ఆధునీకరణ
- సందర్శకులకు అన్ని వసతులు



ది హ్యాపీ స్ట్రీట్ పార్కు ముఖ ద్వారం



ది హ్యాపీ స్ట్రీట్ పార్కు డ్రోన్ వ్యూ

రాజమహేంద్రవరం సిటీ: పచ్చని చెట్లు, ప్రశాంతమైన వాతావరణంలో ది హ్యాపీ స్ట్రీట్ పార్కును అద్భుతంగా తీర్చిదిద్దారు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.2.80 కోట్లతో ఆధునీకరించారు. నగరంలోని ఆంధ్రకేసరి డిగ్రీ కళాశాల సమీపంలో పరమహంస యోగానంద మార్గ్‌లో ఈ పార్కును ఏర్పాటు చేశారు. పార్కులో నిటారుగా పెరిగిన భారీ చెట్లను తొలగించకుండా పర్యావరణ హితంగా ఉండేలా ఆధునిక వసతులతో సిద్ధం చేశారు. సరికొత్త హంగులతో నగరంలో ఎక్కడా లేని విధంగా పార్కును తయారు చేశారు. తేనేపట్టు ఆకారంలో ఉండే హనీ కోంబ్ సిటింగ్, సందర్శకులు కూర్చునేందుకు రెండు పరిగొల్లాలు, రెండు ప్రత్యేక సర్కిలర్ సిటింగ్ ఏరియాలు, రెండు ట్రీ సిటింగ్ ఏరియాలు ఉన్నాయి. ఆర్నమెంటల్ లైటింగ్, ఒక జిగ్‌జాగ్ సిటింగ్ ఏరియా, ప్రత్యేక ఆకారంలో వైండింగ్ బ్రిడ్జి, ఒక సెల్ఫీ పాయింట్ కూడా ఉంది. నగరంలో మొట్టమొదటి సారిగా కర్విలీనియర్ పాథ్ వే ఏర్పాటు చేశారు. అందరికీ సదుపాయంగా ఉండేలా ప్రత్యేక వాకింగ్ ట్రాక్‌ను వేశారు. పార్కు చుట్టూ లోపలి భాగంలో పూల మొక్కలతో గ్రీనరీగా ఉంచారు. పార్కులో ప్రత్యేకంగా ఉండేలా గడ్డిని పెంచారు. వీటిపాటు సందర్శకుల తిను బండారాలు అందించేందుకు నాలుగు ఫుడ్ కోర్టులు పెట్టించారు.

ప్రత్యేక హంగులతో ఏర్పాటు



పార్కులో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. భారీ చెట్లను తొలగించకుండా పార్కును ఆధునీకరించాం. మొట్టమొదటి సారిగా కర్విలీనియర్ పాథ్ వే ఏర్పాటు చేశాం, నగరంలో ఎక్కడా లేని విధంగా ఆధునిక హంగులతో ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రజలకు అన్ని వసతులు కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం.

– దినేష్‌కుమార్ కమిషనర్ నగర పాలక సంస్థ



పరిగొల్లా సిటింగ్ ఏరియా



సెల్ఫీ పాయింట్

9 నుంచి వై ఏపీ నీడ్స్ జగన్



సమావేశంలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ఈ నెల 9వ తేదీ నుంచి సచివాలయాల కేంద్రంగా జరగనున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు క్లస్టర్ల వారీగా ప్రణాళిక తయారు చేస్తున్నట్టు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి ప్రకటించారు. ఆదివారం ఈ మేరకు క్లస్టర్ ప్రెసిడెంట్లు, జేసీఎస్ ఇన్‌చార్జిలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ మార్గాని భరత్ రామ్, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ కేంద్ర కమిటీ జారీ చేసిన మార్గదర్శకాలు, సచివాలయాల వారీగా నిర్వహించాల్సిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.

పింఛన్ల పంపిణీ 99 శాతం పూర్తి



చంద్రేడులో లబ్ధిదారుడికి పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ జానీ మహమ్మద్

రంగంపేట: మండలంలో మొత్తం 8855 మంది పింఛన్ లబ్ధిదారులుండగా ప్రభుత్వం రూ.2,43,30,750 మంజూరు చేసింది. ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుంచే వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఇప్పటివరకూ మండలంలో 99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. కొందరు లబ్ధిదారులు వివిధ కారణాలతో అందుబాటులో లేకపోవడంతో అటువంటివారికి తరువాత రెండు, మూడు రోజుల్లో అందించారు. దూర ప్రాంతాల్లో ఉన్నవారు, ఆసుపత్రుల్లో ఉన్న లబ్ధిదారులకు కూడా వలంటీర్లు పింఛన్లు అందజేస్తున్నారు.

నేడు ఎంపీడీఓ కార్యాలయంలో స్పందన

రాజానగరం: ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ప్రతి సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న «స్పందన» కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగే ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులంతా తప్పక హాజరుకావాలన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

రంగంపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మండల స్థాయి స్పందన కార్యక్రమం జరగనుంది. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ హాజరుకానున్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

బిక్కవోలు: మండలంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పోసిబాబు ఆదివారం పరిశీలించారు. మండలంలో ఫారం-6 కొత్త ఓటర్ల దరఖాస్తులు 182, ఫారం-7 రూపేణా చనిపోయినవారి పేర్ల తొలగింపు కోసం 45, ఫారం-8 మార్పులు చేర్పుల కోసం 375 కలిపి మొత్తంగా 502 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

వైభవంగా కల్యాణోత్సవం



పాతనామవరంలో స్వామి వారి కల్యాణోత్సవం దృశ్యం

రాజానగరం: రాష్ట్ర దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పాతనామవరంలో ఆది దంపతుల కల్యాణోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా రాజమహేంద్రవరంలోని ఉమా మార్కండేయస్వామి దేవస్థానం పురోహితులు సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

లేపాక్షి ఎంపోరియంలో ‘థీమెటిక్ ఎగ్జిబిషన్’

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): లేపాక్షి ఎంపోరియంలో మంగళవారం నుంచి 11వ తేదీ వరకూ థీమెటిక్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ ఎం.బాలసుబ్రహ్మణ్యంరెడ్డి ఒక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో హస్తకళలల తయారీదారులే నేరుగా అమ్ముకుంటారు. వైట్‌వుడ్ బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, లేదర్ పప్పెట్, కళంకారి వస్తువులు విక్రయించుకుంటారు. అలాగే ఇక్కడ దీపావళి సంబంధించి దీపాలను కూడా విక్రయిస్తారని తెలిపారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీ

ప్రకాశం నగర్: జిల్లా బ్రాహ్మణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 2023 సంవత్సరానికి సంబంధించిన స్కాలర్‌షిప్పుల పంపిణీ కార్యక్రమం ఆదివారం స్థానిక గోదావరి గట్టున ఉన్న మల్లిగ సత్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు దంతుర్తి సత్యప్రసాద్ అధ్యక్షత వహించగా, పెద్దింటి రామం, బుద్ధవరపు చక్రవర్తి, దంతుర్తి వీరభద్రం, సుధాకర్, ఐసీడీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ రాజులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దంతుర్తి కుటుంబం సాయం కారణంగానే విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా ట్రస్టు కోశాధికారి గాడేపల్లి సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి మంత్రిప్రగడ వేణుగోపాల్, హోతా శర్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందిస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆనందా గార్డెన్స్‌లో క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన ఆదివారం వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు మసరం సూర్యనారాయణ ప్రతి నెలా క్రమం తప్పకుండా వృద్ధులకు పింఛన్లు అందిస్తున్న క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, కార్యదర్శి గుబ్బల గంగా భవానీని అభినందించారు. వెల్‌నెల్ సెంటర్ సభ్యుల సహకారంతో దివ్యాంగుడుకి వీల్‌చైర్‌ని అందించారు. 80 మంది వృద్ధులకు రూ.500 చొప్పన రూ.40వేలు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.